సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023




తెలంగాణ పవర్ ఫుల్

నాడు వ్యవసాయం దండగ అంటే.. నేడు ప్రభుత్వం పండగగా మార్చిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 8లో



బీరువా గొడవతోనే..

బీరువా విషయంలో అత్తాకోడలి మధ్య జరిగిన గొడవ.. కోడలు బలవన్మరణానికి దారితీసింది. అక్కన్నపేట ఎస్ఐ వివేక్ వివరాలు వెల్లడించారు. 8లో



వసతుల నిలయం.. గురుకులం

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 9లో..

ఉసురు తీస్తున్న రోడ్డు విస్తరణ

- వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- కరువైన సూచిక బోర్డులు, ఎర్రటి రిబ్బన్లు
- ఇప్పటివరకు ముగ్గురు మృత్యువాత.. పలువురికి గాయాలు

ఇష్టారీతిన మెదక్ - సిద్దిపేట- ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులు



పాలమాకుల సమీపంలో కల్వర్టు గుంతలో పడిన ద్విచక్ర వాహనాలు(ఫైల్)

సాక్షి, సిద్దిపేట: మెదక్ - సిద్దిపేట - ఎల్కతుర్తి రోడ్డు విస్తరణ పనులు వాహనదారులకు శాపంగా మారాయి. పనులు జరుగుతున్న సమయంలో గుంతలు తీసిన దగ్గర కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికే ఈ ప్రమాదాల్లో ముగ్గురు బలయ్యారు. పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

- మెదక్ -సిద్దిపేట -ఎల్కతుర్తి జాతీయ రహదారి 133.61 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.1,461 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.
- ఈ రోడ్డు విస్తరణ పనులను జాతీయ రహదారుల శాఖ రెండు ప్యాకేజీలుగా విభజించింది. మొదటి ప్యాకేజీలో భాగంగా మెదక్ నుంచి సిద్దిపేట 69.97కి.మీ రెండో ప్యాకేజీ సిద్దిపేట నుంచి హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు 63.64 కి.మీగా ఉంది.
- ప్రస్తుతం గ్రామాల దగ్గర ఈ రోడ్డు సుమారుగా 4 మీటర్లు, పట్టణాల దగ్గర 8 నుంచి 10 మీటర్లు ఉంటుంది. ఫోర్‌లైన్ రోడ్డు 15 మీటర్ల వెడల్పుతో, సాధారణ చోట్ల డబుల్ రోడ్డుతో 10 మీటర్ల మేరకు విస్తరణ చేయనున్నారు. రంగధాంపల్లి నుంచి జిల్లెలగడ్డ వరకు 47 కి.మీ ఉంటుంది.
- ఈ విస్తరణ పనుల్లో భాగంగా లోతుగా మట్టిని తీసి అందులో కంకర, డస్ట్, మొరంతో నింపుతున్నారు. ఆ సమయంలో అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు, రెడ్ రిబ్బన్, రేడియం స్టిక్కర్లు, బారీకెడ్లు, వర్క్ ఇన్ ప్రోగెస్ అనే బోర్డులను సదరు కాంట్రాక్టర్ ఏర్పాటు చేయని పరిస్థితి.
- అలాగే కల్వర్టుల నిర్మాణానికి తీసిన గుంతలు కూడా వాహనదారులకు కనిపించకపోవడంతో అమాంతం వాహనాలతో అందులో పడిపోతున్నారు. రోడ్డు సెఫ్టీ నిబంధనలు పాటించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.
- ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు జరిగే సమయంలో సరైన నిబంధనలు పాటించే విధంగా చూడాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదాలు ఇలా..

ఫిబ్రవరి 21: కోహెడ మండలం ఆరెపల్లి శివారులో కల్వర్టు నిర్మాణానికి రోడ్డుపై వేసిన పైప్‌లను ఢీకొని విద్యుత్ శాఖ ఇంజనీర్ పొట్టి సుధాకర్(30) మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారణమైన ఏజీ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫిబ్రవరి 19: రాత్రి సమయంలో మిట్టపల్లికి చెందిన పొన్నాల మల్లేశం(26) నంగునూరు మండలం పాలమాకుల వద్ద తీసిన కల్వర్టులో వాహనంతో సహా పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.



లక్ష్మణ్(ఫైల్)



మల్లేశం(ఫైల్)

ఫిబ్రవరి 22: బుధవారం రాత్రి అదే కల్వర్టులో పడి కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన మద్దెల లక్ష్మణ్(44) మృతి చెందాడు.

ఫిబ్రవరి 20: తెల్లవారుజామున అదే గుంతలో నంగునూరుకు చెందిన బోయిని నరేశ్ వాహనంతో సహా పడిపోయాడు. గాయాలు కావడంతో సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



పాలమాకుల వద్ద సూచిక బోర్డు లేకుండానే పనులు చేస్తున్న

తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి..

నంగునూరు(సిద్దిపేట): మండలం పాలమాకుల వద్ద కల్వర్టులో పడి బుధవారం రాత్రి వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే గుంతలో పడి ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు గాయాల పాలు కాగా ఒక వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ మండల గుండారెడ్డిపల్లికి చెందిన మద్దెల లక్ష్మణ్ (44) బుధవారం రాత్రి సిద్దిపేట నుంచి మోటార్ సైకిల్‌పై వస్తూ పాలమాకుల వద్ద కల్వర్టు నిర్మాణానికి తవ్విన గుంతలో పడిపోయాడు. సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందాడు. అతని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు ఏజీ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి సుమన్‌బర్వాపై కేసు నమోదు చేసినట్లు రాజగోపల్‌పేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

న్యాయం చేయాలని రాస్తారోకో

మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామానికి బయలుదేరిన బంధువులు సంఘటన స్థలాకి రాగానే వాహనాన్ని అక్కడే నిలిపి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. సంబంధిత కాంట్రాక్టర్ మృతి చెందిన మూడు కుటుంబాలకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. గ్రామస్తులు వినకపోవడంతో కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎస్ఐ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అతనిపై కేసు నమోదు చేసినందున ఆందోళన విరమించాలని కోరారు. దీంతో అక్కడి నుంచి వెళ్లారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న గుండారెడ్డిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

సూచికబోర్డులు పెట్టాలి

రహదారిపై పనులు చేస్తున్న సమయంలో సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన పనులు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలి. గాయపడ్డ వారికి ఆర్థిక సహాయం అందజేయాలి.

–దేవులపల్లి యాదగిరి, నంగునూరు

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం..

రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కొన్నిచోట్ల హెచ్చరిక, సూచిక బోర్డులను ఇప్పటికే ఏర్పాటు చేశాం. మరికొన్ని చోట్ల ఏర్పాటు చేయిస్తున్నాం. అప్పటి వరకు పనులు అపివేయాలని ఆదేశించాం.

–మనోహర్, ఎన్‌హెచ్ డీఈ

సమస్య మీది.. పరిష్కారం మాది

'సాక్షి' ఫోన్ ఇన్

మీ ఇంటిచుట్టూ కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయా? తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యంలో లోపాలున్నాయా? అయితే మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకురండి.. పరిష్కారానికి మా వంతు కృషి చేస్తాం.





తేదీ: 25.02.2023

సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

అధికారి: రవీందర్‌రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

ఫోన్ నంబర్లు: 94404 49004, 98668 98692

న్యూస్‌రీల్

మల్లన్నను దర్శించుకున్న కమిషనర్లు



మల్లన్న సన్నిధిలో అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని రాష్ట్ర పంచాయతీరాజ్ స్పెషల్ కమిషనర్లు సౌమ్య, ప్రసాద్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ హన్మంతరావు గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ అధికారులు, అర్చకులు, మండల పరిషత్ కార్యాలయ సుపరింటెండెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు


జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాశ్



అధ్యాపకులతో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

దుబ్బాకటౌన్: మార్చి 15 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. ఆయన గురువారం దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిర్ధారించిన తేదీల ప్రకారం జిల్లాలో మూడు దఫాలుగా ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. చివరి విడత పరీక్షలు ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతున్నాయన్నారు. అలాగే ఇంటర్ వార్షిక పరీక్షలు ఇబ్బందులు లేకుండా జరిగేలా అన్ని రకాల సౌకర్యాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6, 7, 8, 9, 10వ తరగతిల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు దగ్గరిలోని ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

అంధత్వాన్ని నిర్మూలించడమే లక్ష్యం



కంటి పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: అంధత్వాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం రిమ్మనగూడలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారన్నారు. కేంద్రం నుంచి సహకారం లభించకున్నా సంక్షేమంలో తెలంగాణ దూసుకెళ్తున్నదన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న పరీక్షల తీరు, కంటి అద్దాల పంపిణీని ఆయన పరిశీలించారు. మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలను పొందాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షులు బెండె మధు, సర్పంచ్ బాలమణివెంకట్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నాయకులు భీమప్ప, నల్ల నాగేశ్వర్‌రావు, మన్నెం శ్రీనివాస్, మురళీ, నర్సింహ్మారావు, బాల్‌రాజు, పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారుడు ఆకాశ్‌కు కేకేఎఫ్ఐ నేషనల్ స్కాలర్‌షిప్



ఆకాశ్, పీఈటీ మురళీకృష్ణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్ సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి బి. ఆకాశ్ కేకేఎఫ్ఐ(ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(వర్గల్) పీఈటీ మురళీకృష్ణ గురువారం వివరాలు వెల్లడించారు. 9వ తరగతి చదువుతున్న వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన ఆకాశ్ 2022 అక్టోబర్ 29 నుంచి నవంబర్ 2 వరకు మహారాష్ట్రలోని పల్టానాలో జరిగిన 32వ సబ్‌జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి(బెస్ట్ ప్లేయర్) ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యాభ్యాసం పూర్తయ్యేంత వరకు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు.

జాతీయ స్థాయి అవార్డుకు ఈశ్వర్ ఎంపిక



ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న ఈశ్వర్

అక్కన్నపేట(హుస్నాబాద్):బహుజన సాహిత్య అకాడమీ 'బెస్ట్ సర్వీస్' సొసైటీ అవార్డుకు అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన నారదాసు ఈశ్వర్ ఎంపికయ్యారు. మార్చి 12న తిరుపతిలో నిర్వహించే సౌత్ ఇండియన్ బహుజన రైటర్స్ 06వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ స్థాయి అవార్డును అందించనున్నారు. ఈ మేరకు ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో గ్రామీణ అభివృద్ధిలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజులను తాత్కల్ పద్ధతిలో చెల్లించుటకు షెడ్యూల్ విడుదలైందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 4 వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. పదో తరగతికి గాను ప్రతీ సబ్జెక్టుకు థియరీకి రూ.100, ప్రాక్టికల్‌కు రూ.100 తాత్కల్ ఫీజు రూ.500 అదనంగా చెల్లించాలన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌కు గాను ప్రతి సబ్జెక్టుకు థియరీకి రూ.100, ప్రాక్టికల్‌కు రూ.100 తాత్కల్ ఫీజు రూ.1,000 అదనంగా చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి (8008403635)ను సంప్రదించాలన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు పాఠశాలలే పునాది




మాట్లాడుతున్న ఫైజాఅహ్మద్

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాఠశాలలోనే పునాది పడుతుందని ట్రైనీ కలెక్టర్ ఫైజాఅహ్మద్ అన్నారు. గురువారం ఆయన అక్కనపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదవడంతోపాటు నిరంతర సాధనతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సెల్‌ఫోన్లు పక్కనపెట్టి చెడు అలవాట్లు, వ్యసనాలకు బానిసలు కాకుండా చక్కగా చదవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్, ఆంజనేయులు, సైదిరెడ్డి, దేవీప్రసాద్, దీపమాల, భాగ్యరేఖ, అంజయ్య, జ్యోతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల భాగస్వామ్యం

- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- 2023–24 నాబార్డ్ క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ



నాబార్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు, జిల్లా అధికారులు, బ్యాంకర్లు

సిద్దిపేటరూరల్: ప్రజల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల భాగస్వామ్యం కావాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీసీ/డీఎల్ఆర్సీ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంకులు కమర్షియల్ టార్గెట్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రైతుబంధు, స్వయం సహాయక రుణాలు, ఈజీఎస్ చెల్లింపులు, ఆర్థిక సహాయ కార్యక్రమాలకు ప్రభుత్వం అందజేసే నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరాదన్నారు. బ్యాంకుల కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. వన్ టైం సెటిల్మెంట్ కింద యూబీఐ, ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, కెనరా బ్యాంకులలో పాత పంట రుణాలు, ఇతర బకాయిలు 50 నుంచి 80% రాయితీతో చెల్లించాలన్నారు. లక్ష్యం మేరకు రూ.200 కోట్ల రుణాలను త్వరగా మహిళా సంఘాలకు అందించాలన్నారు. స్వయం ఉపాధి రుణాలను త్వరగా అందించాలన్నారు.

ముద్ర లోన్స్ సంఖ్య పెంచాలి

సిద్దిపేటలో 250 మంది మొబైల్ మెకానికులకు స్వయం ఉపాధి రుణాలను ముద్ర లోన్ ద్వారా రుణాలు అందించేందుకు ఎస్‌బీఐ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే ఇతర బ్యాంకులవారు కూడా ముందుకు వచ్చి మరింతగా ముద్ర లోన్స్ అందించాలన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు రూ.5,579 కోట్లతో 2023–24కు పొటెన్షియల్ లింకేజ్ నాబార్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్, నాబార్డ్ ఏజీఎం తిమోతి, ఆర్‌బీఐ ఏజీఎం శివరామన్, యూబీఐ డీజీఎం సత్యం, డీఆర్డీఓ, డీబీసీడీఓ, ఎస్సీ కార్పొరేషన్, పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకర్లు, మెప్మా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పామాయిల్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంలో వ్యవసాయ, ఆయిల్ ఫెడ్, హార్టికల్చర్, అనుబంధ సంస్థలు సమన్వయంతో కలిసి పని చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జిల్లా అధికారులతో పామాయిల్ సాగు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మార్చిలోపు మొక్కలు నాటించడం లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. డ్రిప్ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆయా కంపెనీలను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల ఎకరాల లక్ష్యం ఉన్నప్పటికీ నేటికి 4,500 ఎకరాల్లోనే మొక్కలు నాటడం పూర్తయ్యిందన్నారు. పెద్ద రైతులను చైతన్యం పరచి, ప్రొత్సహించాలన్నారు. మొక్క ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి వస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం ప్రారంభంలోపు..

వర్షాకాలం ప్రారంభంలోపు పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, రోడ్ల బీటీ రెన్యూవల్స్ పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పీఆర్ బీటీ రోడ్ల రెన్యూవల్ ప్రగతిపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీరాజ్ ద్వారా 274 , ఆర్‌అండ్‌బీ ద్వారా 26 పనులు గుర్తించడం జరిగిందన్నారు. రోడ్లు వేయడంతో పాటు ప్రమాదాలు నివారించాలని అధికారులకు సూచించారు. గజ్వేల్ రింగురోడ్డు మార్చిలోపు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు.

క్లుప్తంగా

లేగదూడ మృతి

చిరుత చంపిదనే అనుమానం



ఆందోళనలో బాధిత రైతు కుటుంబం

నారాయణఖేడ్: పశువుల పాకలో కట్టి ఉంచిన లేగదూడ మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ర్యాకల్‌కు చెందిన లింగయ్యకు గ్రామానికి కొద్దిదూరంలో వ్యవసాయ భూమి ఉంది. అందులో పశువులపాక ఏర్పాటు చేశాడు. రోజులాగే బుధవారం రాత్రి తన పశువులను మేపి పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా పాకకు కొద్ది దూరంలో లేగదూడ మృతి చెంది ఉంది. గతంలో ర్యాకల్‌కు సమీపంలోని సిర్గా పూర్, కల్హేర్ మండలాల్లో చిరుతల దాడిలో పదుల సంఖ్యలో పశువులు మృతిచెందిన విష యం తెలిసిందే. చిరుత దాడితోనే లేగదూడ మృతిచెందినట్టు అనుమానిస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

మరోపెళ్లికి సిద్ధమైన వ్యక్తిని శిక్షించాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రేమపెళ్లి చేసుకొని..తక్కువ కులమని వదిలిపెట్టి, మరోపెళ్లికి సిద్ధమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయంలో విలేకరులతో మా ట్లాడారు. పటాన్‌చెరులోని అంబేడ్కర్‌నగర్‌లో న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట ధర్నా చేసిన సౌందర్యకు న్యాయం చేయాలన్నారు. ఆమెకు అన్ని సంఘాలు మద్దతు ఇవ్వాలన్నా రు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, సహకార కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై...

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భానూర్–బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల రుద్రారం గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్(42) ఏ పనిచేయకుండా తాగుడు బానిసయ్యాడు. భర్త ప్రవర్తనకు విసిగిపోయిన భార్య శోభ తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఆరునెలల క్రితం నందిగామలోని తల్లిగారింటికి వెళ్లింది. గురువారం మద్యంలో విషం కలుపుకొని శ్రీనివాస్ నందిగామ గ్రామసమీపంలో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి గురువారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పరచగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికి రూ.28వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు.

విద్యార్థులతో పనులు చేయించడం సరికాదు

నర్సాపూర్: విద్యార్థులతో పనులు చేయించిన హెచ్‌ఎం లాలునాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లోని పోస్టాఫీసు సమీపంలోని మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులతో గురువారం హెచ్‌ఎం బెంచీలు మోయించాడని చెప్పారు. ఇదే విషయమై హెచ్‌ఎంను వివరణ కోరగా తమ పాఠశాలకు ఓ సంస్థ బెంచీలు అందజేసిందని.. పలువురు ఉపాధ్యాయులు సెలవులో ఉండడంతో కొందరు విద్యార్థులు సహకరించారని చెప్పారు. విద్యార్థులతో పనులు చేయించాలనే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ పవర్ ఫుల్

- నాడు తంటాలు.. నేడు కాంటాలు
- ప్రభుత్వ అద్భుత విజయం: మంత్రి హరీశ్‌రావు



మార్కెట్‌లో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: '' నాడు వ్యవసాయం దండగ అంటే.. నేడు ప్రభుత్వం పండగగా మార్చింది.. తెలంగాణలో నీళ్ల ఫుల్, ఎరువులు, విత్తనాలు, కరెంట్ ఫుల్, కాళేశ్వరం ద్వారా గోదావరి నీటితో చేపలు ఫుల్, పంటలు ఫుల్ ఇలా మొత్తంగా తెలంగాణ పవర్‌ఫుల్ '' అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం పత్తి మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం మండుటెండల్లో చెరువులు, చెక్ డ్యాములు, వాగులు నిండుగా ఉన్నాయని, అన్ని వర్గాలకు పని, ఉపాధి దొరుకుతుందన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో యాసంగిలో 10 లక్షల ఎకరాల సాగు అయ్యేదని, తెలంగాణ వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల యాసంగిలో 53 లక్షల ఎకరాల సాగైందన్నారు. అప్పుడు రైతులు అనేక తంటాలు పడ్డారని, కానీ ఈరోజు తెలంగాణ వచ్చాక ప్రతి గింజకు కాంటాలు వచ్చాయని ఇది తెలంగాణ ప్రభుత్వం సాధించిన అద్భుతమైన విజయమని అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక పొద్దు తిరుగుడు సాగు పెరిగిందని, 6200 ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారన్నారు. 60 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. రైతుల కోరిక మేరకు పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్, వ్యవసాయ మంత్రిని కోరామన్నారు. రాష్ట్రంలో మొదటి కొనుగోలు కేంద్రం సిద్దిపేట జిల్లాలో ప్రారంభమైందని, రైతులు ప్రభుత్వ మద్దతు ధర రూ.6400 పొందాలని సూచించారు.

- సిద్దిపేట బల్దియా పరిధిలోని 26 వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. అక్కడే ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు.
- హరితహారంలో పంపిణీ చేసిన జామ మొక్క చెట్టుగా ఎదిగింది. కాయలు కూడా కాస్తోంది. వార్డు పర్యటనలో ఉన్న మంత్రికి ఆ ఇంటికి యజమానురాలు శోభ జామపండ్లు అందజేసింది. తాను ఇచ్చిన మొక్కను కాపాడి పండ్లు కాసేలా సంరక్షణ చేసిన వారిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.



'మనూ'ను సందర్శించిన సంగారెడ్డి విద్యార్థులు

రాయదుర్గం: మనూ యూనివర్సిటీని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ అధ్యయన పర్యటనలో భాగంగా గురువారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుమైరాసయీద్, అధ్యాపకులు రూహితరన్నుమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బాలికల హాస్టల్, సయ్యద్ హమీద్ లైబ్రరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, అండ్ జర్నలిజమ్, ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, ఉర్దూ విభాగాలను పరిశీలించారు. వర్సిటీలో విద్యా అవకాశాల గురించి అడిగారు.

నేడు పటాన్‌చెరు పారిశ్రామికవాడకు ఇస్రో చైర్మన్



పటాన్‌చెరు పారిశ్రామికవాడలో రూపుదిద్దుకున్న రాకెట్ పరికరం

పటాన్‌చెరు: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ వారి ఆర్డర్ మేరకు పటాన్‌చెరు పారిశ్రామికవాడలో వినూత్న రాకెట్ పరికరం రూపుదిద్దుకుంది. ఇస్రో సూచనలతో 'సిమ్యూలేటడ్ క్ర్యూ మాడ్యూల్ రాకెట్' పరికరాలను అసెంబుల్ చేసి మానవ సహిత రాకెట్ పరికరాన్ని తయారు చేశారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని మంజీర మషీన్ బిల్డర్స్ కంపెనీ ఈ రాకెట్ పరికరాన్ని రూపొందించింది. దీనిని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ)కు అందించనున్నారు. పరిశ్రమలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 12.00 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా రానున్నారని మంజీర మషీన్ బిల్డర్స్ ఎండీ వీఎస్ సాయి ప్రకాష్ తెలిపారు. ఆయనతో పాటు వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ డా.ఎస్ ఉన్నికృష్ణన్ నాయర్, హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ డా.ఆర్.ఉమా మహేశ్వరన్ ముఖ్య అతిథులుగా వస్తున్నారు.

పోలీసులమని చెప్పి..

పటాన్‌చెరు టౌన్ : పోలీసులమని చెప్పి బెదిరించి సెల్ ఫోన్ తీసుకున్న ఇద్దరిపై కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పటాన్‌చెరుకు చెందిన శివశంకర్ బుధవారంరాత్రి ఇస్నాపూర్‌లో ఆగి పరిచయస్తుడైన ఓ వ్యక్తితో మాట్లాడుతున్నాడు. ఈక్రమంలోనే జీడిమెట్లలోని డ్రైవర్‌గా పని చేస్తున్న కృష్ణయ్య ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న గోపితో కలిసి వచ్చాడు. ఒకరికి ఫోన్ చేయాలంటూ శివశంకర్ నుంచి ఫోన్ తీసుకున్నాడు. మాట్లాడిన తర్వాత మద్యం తాగించమని అడిగి, అక్కడి నుంచి ఫోన్‌తో జారుకున్నారు. మరో ఫోన్ నుంచి శివశంకర్ ఫోన్ చేస్తే..సీఐని మాట్లాడుతున్నా ఉదయం వచ్చి ఫోన్ తీసుకో అన్నాడు. ఈ ఘటనపై శివశంకర్ ఫిర్యాదు చేశాడు.

మిషన్‌లో పడి కార్మికుడి దుర్మరణం



జితేందర్ మోహతా (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ప్రమాదవశాత్తు మిషన్‌లో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. గురువారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. యూపీలోని ఘజీయాబాద్ జిల్లా దేహత్ గ్రామానికి చెందిన జితేందర్ మోహతా (36) మండలంలోని కూచారంలో అద్దెకుంటూ గ్రామ శివారులోని అమీంజీ రబ్బరు పరిశ్రమలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మిషన్ రోలర్‌లో పడిపోవడంతో శరీర పైభాగం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి మామ సురేశ్ మోహతా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఇద్దరు రైతులపై దాడి

మద్యంమత్తులో ఐదుగురు యువకుల వీరంగం

పటాన్‌చెరు టౌన్: ఇద్దరు రైతులపై ఐదుగురు యువకులు దాడి చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌కు గురువారం తెల్లవారుజామున శంకర్‌పల్లి మండలం గాజులగూడేనికి చెందిన రైతులు రవీందర్ రెడ్డి, పవన్ రెడ్డి ఓ వాహనంలో కూరగాయలు తీసుకొచ్చారు. ఆవాహనంపైకి ఎక్కి ఐదుగురు మద్యం సేవిస్తున్నారు. కూరగాయల లోడు దించాలి..కిందకు దిగమని రైతులు కోరారు. మందు తాగిన తర్వాత అన్‌లోడ్ చేయడంటూ వాగ్వాదం చేస్తుండగా బాటిల్ కిందపడింది. ఆవేశంతో ఆ యువకులు రైతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వెంటనే తేరుకున్న రైతులు డయల్ 100 కాల్ చేశారు. దీంతో ఆ యువకులు పారిపోయారు. చికిత్స నిమిత్తం బాధిత రైతులను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



నాగని చిన్నమల్లయ్య (ఫైల్)

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రాఘవాపూర్‌కు చెందిన నాగని చిన్నమల్లయ్య(55) అదే గ్రామంలో బుధవారం ఓ భవన నిర్మాణ పనికి వెళ్లాడు. పనులు చేస్తుండగా, బిల్డింగ్ రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్నకొడుకు వంశీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ గంగరాజు

మిరుదొడ్డి(దుబ్బాక): నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భూంపల్లి ఎస్‌ఐ వి.గంగరాజు హెచ్చరించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైక్ నడిపే ప్రతీ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయా వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ వంటి ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. నేరాల అదుపు కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిత్యం నిఘా పెంచుతున్నట్లు తెలిపారు. శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

బీరువా గొడవతోనే బలవన్మరణం



మనీషా మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్): బీరువా విషయంలో అత్తాకోడలి మధ్య జరిగిన గొడవ..కోడలు బలవన్మరణానికి దారితీసింది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ చెప్పిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన టేకుల మనీషా(26) బుధవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కుటుంబసభ్యులెవరూ ఫిర్యాదు చేయకపోవడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. గురువారం మృతురాలి తండ్రి జన్నె ముత్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అత్తతో జరిగిన గొడవ కారణంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందన్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరునెలల క్రితమే స్వగ్రామానికి...

మండల కేంద్రానికి చెందిన టేకుల రమేష్‌కు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ చెందిన మనీషాతో పదేళ్ల కిత్రం వివాహం జరిగింది. కొడుకు, కూతురు సంతానం. దంపతులిద్దరూ ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలసవెళ్లారు. ఆరునెలల క్రితమే స్వగ్రామానికి వచ్చారు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంతలోనే ఇలా జరిగింది.

మెదక్ పట్టణ పోలీసులపై కేసు నమోదు చేయాలి



మెదక్‌లో మాట్లాడుతున్న సీపీఐ నేతలు



ఎస్పీ రోహిణీ ప్రియదర్శినికి ఫిర్యాదు చేస్తున్న సంఘం సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ: ఖదీర్ ఖాన్ కేసులో మెదక్ పట్టణ పోలీసులపై ఐపీసీ సెక్షన్ 302 కేసు నమోదు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలిక్‌తో కలసి వారు గురువారం ఖదీర్‌ఖాన్ కుటుంబసభ్యులకు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత మహిళ మరియమ్మ నుంచి ఖదీర్ ఖాన్ వరకు ఠాణాల్లో జరుగుతున్న లాకప్‌డెత్‌లు చూస్తే పోలీసులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ఖదీర్ ఖాన్ కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలన్నారు. పరామర్శించిన వారిలో నేతలు సంజీవ్ రెడ్డి, దుర్గయ్య, శంకర్ ఉన్నారు.

ఖదీర్‌ఖాన్ మృతిపై విచారణ చేయండి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ మృతిపై విచారణ చేయాలని జమైత్ ఉలమ మెదక్ అధ్యక్షుడు ఖాజా షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మెదక్ ఎస్పీ రోహిణీ ప్రియదర్శినికి ఫిర్యాదు చేశారు. ఖదీర్‌ఖాన్ మృతిపై ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా విచారణ జరిపి.. అతడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జమైత్ ఉలమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు.. బైక్ ఢీ

- డ్రైవర్ వణుకుతుండడంతో మద్యం సేవించాడని అనుమానం
- డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేసిన పోలీసులు
- షుగర్‌తోనే ఇబ్బంది పడిన డ్రైవర్

పటాన్‌చెరు టౌన్: ఓ ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టాడు. జరిగిన ఘటనతో ఒక్కసారిగా వణికిపోయాడు. దీంతో అతడు మద్యం సేవించి ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు, ఎంఈఓ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం .. మండలపరిధిలోని ఇస్నాపూర్ అంతర్గత రహదారిలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ పర్వతాలు గురువారం ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సమయంలో ఆ డ్రైవర్ వణుకుతుంటే మద్యం సేవించి ఉంటాడని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనంతో ఏఎస్‌ఐ జగదీష్ సంఘటనస్థలానికి వెళ్లి డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా, అతను మద్యం సేవించలేదని తేలింది. అయితే షుగర్ కారణంగా ఇలా జరిగి ఉండవచ్చని ఓ అంచనాకు వచ్చారు. ర్యాష్ డ్రైవింగ్ నేరం కింది అతనికి రూ.1100 జరిమానా విధించారు. విద్యార్థులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్ అనారోగ్యంతో ఉంటే ఇబ్బంది అని వెంటనే అతని స్థానంలో వేరొకరిని నియమించుకోవాలని ప్రిన్సిపల్‌కు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దుబ్బరాజం మృతదేహం

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా భూంపల్లి– అక్బర్‌పేట మండలం ఖాజీపూర్‌కు చెందిన నందాల దుబ్బరాజం (57) తన భార్య స్వరూపతో కలిసి బైక్‌పై గురువారం సాయంత్రం మెదక్ జిల్లా చేగుంట వైపునకు వెళుతున్నాడు. బీకొండాపూర్ చెరువు మలుపు వద్ద కుక్క అడ్డు రాగా, దానిని తప్పించబోయి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజం తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న స్వరూపకు గాయాలు కాగా స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. గాయపడిన స్వరూపను మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి



సంఘటనస్థలంలోనే మృతి చెందిన మైనోద్దీన్

ఝరాసంగం(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం రాయికోడ్ మండల పరిధిలోని మామిడిపల్లికి చెందిన మైనోద్దీన్(31) గురువారం రాత్రి తన తండ్రి సాధిక్‌అలీ(60)తో కలిసి బైక్‌పై జహీరాబాద్ నుంచి ఝరాసంగం వైపు వెళుతున్నారు. కృష్ణాపూర్ కమాన్ వద్దకు రాగానే ఝరాసంగం నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న మైనోద్దీన్‌కు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన సాధిక్‌అలీని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గోనె సంచుల కొనుగోలులో అవినీతి

సొసైటీ డైరెక్టర్లు, రైతుల ఆరోపణ



సీఈఓ నర్సింలుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): గోనె సంచుల కొనుగోలు పేరిట రామాయంపేట సహకార సంఘంలో అవినీతి చోటు చేసుకుందని ఇద్దరు డైరెక్టర్లతోపాటు రైతులు ఆరోపించారు. సహకార సంఘం డైరెక్టర్లు దేవుని నర్సింలు, పోచమ్మల ఐలయ్య, రైతులు గురువారం సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కొత్త గోనె సంచుల కొనుగోలు పేరిట రూ.20నుంచి రూ.25 లక్షల మేర అవినీతి జరిగిందన్నారు. కమీషన్ల పేరిట కొందరు డబ్బులు దండుకున్నారని, ఎన్నికలు జరిగి మూడేళ్లు గడుస్తున్నా సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. ధాన్యం కొనుగోలులో సొసైటీకి వచ్చిన కమీషన్లు కూడా సరిగ్గా జమ చేయలేదని, ఇందులో కూడా స్వాహా జరిగిందని ఆరోపించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ మాట్లాడుతూ సొసైటీ వారు రైతులను దోచుకుతింటున్నారని, అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం సొసైటీ సీఈఓ నర్సింలుకు వినతిపత్రం అందజేశారు. రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య, చాకలి వెంకటి, చింతల స్వామి, భూమ కిషన్, శ్రీకాంత్‌రెడ్డి, కుమార్‌సాగర్‌లు సీఈఓను కలిసిన వారిలో ఉన్నారు. ఈ విషయమై సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రంను సంప్రదించగా, సంఘంలో ఎలాంటి అవినీతి చోటుచేసుకోలేదన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమైనట్టు గురువారం పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

సెక్యూరిటీ గార్డు



భాస్కర్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని శేరిపల్లికి చెందిన బెదరబోయిన భాస్కర్ గౌరారం సమీపంలోని ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజూ ఉదయం డ్యూటీకి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చేవాడు. బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్లిన భాస్కర్ రాత్రయినా తిరిగిరాలేదు. భార్య, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలోనూ భాస్కర్ ఇలా ఎవరికి చెప్పకుండా కరీంనగర్‌కు వెళ్లాడని భార్య లావణ్య చెప్పింది. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



మౌనిక

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గోపరి మౌనిక ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయింది. కుటుంబసభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి సిద్దిరాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని అమ్మాయి..



జ్యోతి

నర్సాపూర్ రూరల్: తన కూతురు జ్యోతి అదృశ్యమైందంటూ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి నవాపేట మల్లేష్ ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. అమ్మాయికి మతిస్థిమితం సరిగ్గా లేదని, ఆచూకీ తెలిసిన వారు 9347392675 నంబరుకు కాల్ చేయాలన్నారు.